పోచారం చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం

సమావేశంలో పాల్గొన్న ఆయకట్టు రైతులు, ప్రజా ప్రతినిధులు

- నీటిపారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు
- పోచారం ప్రాజెక్టు ఆయకట్టు రైతులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 14: ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని పోచారం ప్రాజెక్ట్ 'బీ' జోన్ రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని నీటిపారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయకట్టు రైతులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయకట్టు చివరి వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కాలువల్లో మోటర్లను బిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జనవరి 1వ తేదీ నుంచి నాలుగు తడులుగా నీటిని విడుదల చేస్తామని చెప్పారు. సమావేశంలో తిమ్మారెడ్డి సర్పంచ్ అబ్దుల్ అలీ, కళ్యాణి సర్పంచ్ రఘువీర్‌గౌడ్, ఆజామాబాద్ ఉప సర్పంచ్ పట్లోళ్ల కిష్టయ్య, ప్రజాప్రతినిధులు భూంగారి రాము, శ్రావణ్‌కుమార్, సాయాగౌడ్, నాగం రాజయ్య, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

శిశువును అందజేస్తున్న 108 సిబ్బంది

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 14: ప్రసవం కోసం దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో పురిటి నొప్పులు అధికమై ఓ మహిళ 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సోమి ర్యాగడితండాకు చెందిన అజ్మీర్ శ్వేతకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 కు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది గర్భిణిని బాన్సువాడలోని మాతా శిశు దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో వీరహనుమాన్ ఆలయం సమీపంలో పురిటి నొప్పులు అధికమయ్యాయి. దీంతో 108 అంబులెన్స్ టెక్నిషియన్ సాధారణ డెలివరీ చేయగా.. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉండడంతో శ్వేత కుటుంబసభ్యులు 108 సిబ్బంది పైలట్ సంగాగౌడ్, ఈఎంటీ అరవింద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

స్పీకర్‌ను కలిసిన నాగిరెడ్డిపేట జడ్పీటీసీ

ఎల్లారెడ్డి, డిసెంబర్ 14: నాగిరెడ్డిపేట జడ్పీటీసీ మనోహర్ రెడ్డి గురువారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసారి అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో వికారాబాద్ నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన గడ్డం ప్రసాద్‌ను ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కలిసినట్లు చెప్పారు. ఆయన వెంట నాయకుడు వెంకట్ రెడ్డి ఉన్నారు.

స్పీకర్ ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాగిరెడ్డిపేట జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి

రక్తదాతలకు సన్మానం

ఎల్లారెడ్డి రూరల్/సదాశివనగర్, డిసెంబర్ 14: ఆపదలో ఉన్నవారికి అండగా ముమున్నానంటూ రక్తదానం చేస్తూ ప్రాణాలు నిలబెడుతున్న పలువురిని గురువారం కామారెడ్డిలో ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ సికిల్‌సెల్ సొసైటీ ఆధ్వర్యంలో గండిమాసానిపేట్ జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు పర్స వెంకటరమణను సన్మానించి మెమొంటో, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన మొసర్ల శ్రీకాంత్‌రెడ్డి (అబ్బు రెడ్డి) 49సార్లు రక్తదానం చేయడంతో ఆయనను కూడా సత్కరించారు. కామారెడ్డి కర్షక్ బీఈడీ కళాశాలలో 147 మందితో గురువారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేసినందుకు ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రక్తదాతల సమూహం అధ్యక్షుడు డాక్టర్ బాలు, డాక్టర్ వేదప్రకాశ్, జమీల్, కిరణ్, అనిల్, ఆర్కే గ్రూప్ ఆఫ్ కాలేజీస్ అధినేత జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్స వెంకటరమణకు ప్రశంసాపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

మొసర్ల శ్రీకాంత్‌రెడ్డికి..

ఇద్దరు బడి బయటి పిల్లల గుర్తింపు

బడిబయటి చిన్నారులతో సీఆర్పీ మహిపాల్

ఎల్లారెడ్డి, డిసెంబర్ 14: మండలంలోని సోమారిపేట శివారులో ఉన్న ఇటుక బట్టీల వద్ద బడి బయటి ఇద్దరు పిల్లలను అధికారులు గురువారం గుర్తించారు. బడికి వెళ్లకుండా ఉంటున్నారనే సమాచారంతో అక్కడికి వెళ్లి చిన్నారుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేసినట్లు అధికారులు తెలిపారు. చిన్నారులను స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తామని సీఆర్పీ మహిపాల్ తెలిపారు.

కస్తూర్బా పాఠశాలలో వైద్య శిబిరం

విద్యార్థినులను పరీక్షిస్తున్న డాక్టర్ రోహిత్‌కుమార్

నిజాంసాగర్, డిసెంబర్14: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో నిజాంసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో డాక్టర్ రోహిత్‌కుమార్ ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించి, అవసరం ఉన్న వారికి మందులను పంపిణీ చేశారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు సంభవించిన నేపథ్యంలో విద్యార్థినులు జ్వరంతో పాటు జలుబు, దగ్గు సమస్యలతో బాధపడుతున్నారని డాక్టర్ తెలిపారు. దీంతో శిబిరం ఏర్పాటు చేసి అవసరం ఉన్న వారికి మందులను అందజేశామని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరోజన, వైద్య సిబ్బంది సునీత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపు

పనుల వివరాలను వెల్లడిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ జయశ్రీ

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 14: మండలంలోని మల్లయ్యపల్లి గ్రామంలో గురువారం ఉపాధిహామీ గ్రామసభను నిర్వహించారు. గ్రామంలో కొత్తగా చేపట్టే పనులను గుర్తించారు. రోడ్డుపై మొరం వేయడం, ఫార్మేషన్ రోడ్లు, కాలువలు, ఫిష్‌పాండ్స్ తదితర పనులను చేపట్టాలని నిర్ణయించారు. గుర్తించిన పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ జయశ్రీ తెలిపారు. ఉపాధిహామీ జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ పనులకు హాజరు కావాలని ఆమె సూచించారు. కొలతల ప్రకారం పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజయ్య, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

పాత చీరలే..

పంటకు రక్ష

పెద్ద కొడప్‌గల్, డిసెంబర్ 14: పెద్దకొడప్‌గల్ మండల రైతులు తమ భూముల్లో శనగ, మక్క జొన్న, పత్తి, కంది, జొన్న, గోధుమ తదితర పంటలను సాగుచేస్తున్నారు. వాటికి పశువులు, పందుల బెడద ఎక్కువగా ఉన్నది. దీంతో రక్షణగా పాత చీరలను కంచెగా ఏర్పాటు చేస్తున్నారు. వాటిని చూసి అవి బెదిరి పోతున్నాయని రైతులు అంటున్నారు. మార్కెట్‌లో పాత చీరలకు బాగా డిమాండ్ ఉన్నదని రైతులు తెలిపారు. పాత చీరలే పంటలకు శ్రీరామ రక్ష అంటున్నారు.

పెద్దకొడప్‌గల్ శివారులో శనగ పంటకు రక్షణగా కట్టిన చీరలు

సిద్ధరామేశ్వరస్వామి ఆలయంలో ఆడిటింగ్

రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఆడిటర్ విజయభాస్కర్

భిక్కనూరు, డిసెంబర్14 : భిక్కనూరు సిద్ధరామేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఆడిటింగ్ నిర్వహించారు. జిల్లా ఆడిటర్ విజయభాస్కర్ ఆధ్వర్యంలో 2022-23 సంవత్సరానికి సంబంధించిన పలు రికార్డులను ఆయన పరిశీలించారు. పూర్తి వివరాలను సేకరించి ఆదాయ వ్యయాలను పరిశీలించారని ఆలయ కార్య నిర్వహణ అధికారి శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్ పాల్గొన్నారు.